నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
గురువారం | 18 జనవరి 2024 | www.navatelangana.com

అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్ల సీజ్

నవతెలంగాణ తూప్రాన్ రూరల్ మనోహరాబాద్



రాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు తూప్రాన్ ఎస్సై 2 యాదగిరి తెలిపారు. తూప్రాన్ మండలం నాగులపల్లి శివారులో మంగళవారం రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్టు సమాచారం వచ్చినట్టు తెలిపారు. సిబ్బందితో తరలివెళ్లి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసినట్టు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా మట్టి తరలిస్తున్నట్టు తెలిస్తే కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నా దృష్టికి తెస్తే సమస్యలు పరిష్కరిస్తా

నవతెలంగాణ -కంగ్టి



మండలంలో నెలకొన్న సమస్యలు తన దృష్టికి తెస్తే తప్పకుండా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కంగ్టిలో ఎంపీపీ సంగీతరెడ్డి ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల పని తీరును పసికడుతూ ఉండాలన్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వమన్నారు. అంగన్వాడీ, ప్రభుత్వ ఆసుపత్రి, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కల్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లలితఆంజనేలు, ఎంపీపీ వైస్ ప్రసిడెంట్ రేఖా పాటిల్, తహసీల్దార్, ఎంపీడిఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సదాశివపేటలో ఏసీబీ సోదాలు

నవతెలంగాణ- సదాశివపేట





సదాశివపేట మున్సిపాలిటీలో బుధవారం ఏసీబీ దాడులు నిర్వహించి డీఎస్పీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో లంచం తీసుకుంటున్న ఏఈని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సదాశివపేటకు చెందిన శివకుమార్ 2023 సెప్టెంబర్ 25న కొత్త ఇంటి నెంబర్ కోసం మున్సిపాలిటీలో దరఖాస్తు చేశారు. ఇందుకు సంబంధించిన అన్ని పత్రాలు తెలియజేశారు. ఇంటినంబర్ కోసం మున్సిపల్ ఏఈ వెంకట్రావుని అడిగితే చూద్దాం చూద్దామని పలుమార్లు తిప్పించుకున్నారు. ఇంటి నంబరు అలాట్ అయినట్లు ఒకరోజు శివకుమార్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. శివకుమార్ వెంటనే అధికారిని కలవగా పది వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. ఎలాగైనా రూ.8 వేలు ఇవ్వాల్సిందేనని ఏఈ వెంకట్రావు కరాఖండిగా చెప్పారు. మరో అధికారి వేణుగోపాల్‌శర్మకు డబ్బు మొత్తం ఇవ్వాలని చెప్పారు. దీంతో శివకుమార్ ఏసీబీ అధికారులను సంప్రదించారు. డీఎస్పీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. వెంకట్రావు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దాడుల్లో సీఐ వెంకట్రావుగౌడ్, ఇన్స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

కొత్తూరుబీ మాజీ ఎంపీటీసీ మృతి

నవతెలంగాణ జహీరాబాద్



జహీరాబాద్ మండలంలోని కొత్తూరుబీ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రంగమ్మ(77) మృతి చెందినట్లు ఆమె కుమారుడు సర్పంచ్ జగన్మోహన్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం తన ఇంట్లోనే కుటుంబ సభ్యులు బంధువుల రోదనల మధ్య మాజీ ఎంపీటీసీ రంగమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, ఎంపీటీసీ రాములు యాదవ్, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్



ఎన్నికలు జరిగి నెలరోజులు కూడా కాకముందు మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కులుస్తాడన్న సమాచారం తన వద్ద ఉందని, తెలిసిన సమాచారాన్ని పోలీసులకు లేదా ప్రభుత్వానికి చెప్పకుండా బీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారని, వెంటనే మాజీ ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకులు పీసీసీ మెంబర్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు సీఐ ఎర్రల కిరణ్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఆర్ఎస్ ,బిజెపి పార్టీలు ఒకటేనని రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బండి సంజయ్ పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెన్న రాజు, వల్లపు రాజు, నర్సాగౌడ్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు అవకాశం కల్పించిన కాంగ్రెస్

నవతెలంగాణ నారాయణఖేడ్ రూరల్



యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ కాంగ్రెస్ అని, బలమురి వెంకట్‌ను ఎమ్మెల్సీగా కాంగ్రెస్ బలపరిచినందుకు అధిష్టానానికి నారాయణఖేడ్ పట్టణంలోని ఎన్ఎస్‌యుఐ నారాయణఖేడ్ నియోజకవర్గం అధ్యక్షులు దిలీప్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి నివాసంలో దిలీప్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా ఎన్ఎస్‌ఈఐ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బల్మూరు వెంకట్ ఎంపిక హర్షణీయమన్నారు. లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ఎస్‌ఈఐ యూత్ కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాథమిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అఖిలేష్ రెడ్డి, రమేష్, ఎస్సీ సెల్ నాయకుడు శ్రీకాంత్ , అల్లా బకాష్, వెంకట్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

నవతెలంగాణ నారాయణఖేడ్ రూరల్



ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభాదాయకమని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నిజాంపేట్ మండలం దామరచర్ల గ్రామ శివారులో బుధవారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ కొత్త టెక్నాలజీతో ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సాగు విషయాలు ఉద్యాన వన అధికారులను అడిగి, వాటి సాగుకు ఎలాంటి జాగ్రత్తలు రైతులు తీసుకోవాలో, ఎలా పెంచాలో అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ అధికారులు రైతులకు ఎకరాకు 57 మొక్కలు రూ.20 ఒకటి ప్రభుత్వం అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లింగారెడ్డి, భాస్కర్ సెట్ మాజీ ఆత్మ చేర్మెన్.సీడీసీ మాజీ చేర్మెన్ నర్సింహా రెడ్డి, రాంచ్చేందర రెడ్డి, జితేందర్ రెడ్డి కిష్టన్న, హన్మడ్లు, శ్రీనివాస్ రావ్, నారాయణ్ రెడ్డి, శ్రీకాంత్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి, శివకుమార్ గ్రామ రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

నవతెలంగాణ జోగిపేట



జోగిపేట పట్టణంలోని అయ్యప్ప స్వాములు బుధవారం శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఉదయం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మాజీ డిసిసిబి ఉపాధ్యక్షులు జయపాల్ రెడ్డి పాల్గొన్నారు. తాడ్మన్నూర్ బీఆర్ఎస్ నాయకులు అనిల్‌రెడ్డి స్వామి జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. అందోల్ ఎంపీపీ జోగు బాలయ్య, వైస్ ఎంపీపీ మహేశ్వర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు నారాయణ, నాగభూషణం, తాలెల్మ సర్పంచు లింగా గౌడ్, అందోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆకుల రాంబాబు, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు జగన్ రెడ్డి, అశోక్, చాపల వెంకటేశం, స్వాములు ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

నవ తెలంగాణ మిరుదొడ్డి



సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్ పేట-భూంపల్లి మండలం మోతే గ్రామంలో గుండెపోటుతో యువకుడు మృత్యువాత పడ్డాడు. ఆ గ్రామానికి చెందిన నీల సంతోష్ ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోవడం జరిగిందన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. 108 వాహనం ఇంటికి చేరుకునే సంతోష్ మృతి చెందారు. అందరితో కలుపుగోలుగా ఉండే సంతోష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటూ కుటుంబ భారాన్ని మోస్తున్న సంతోష్ మృతి చెందడంతో గ్రామస్తులు చందాలు వేసుకొని రూ.45 వేల సాయం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు గ్రామస్తులు కోరారు.

సిద్దిపేట జిల్లాలో జోరుగా..

గుట్కా దందా

- స్టే పేరుతో విచ్చలవిడి వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

నవ తెలంగాణ - సిద్దిపేట





సిద్దిపేట జిల్లాలో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో గుట్కా నిషేధం అమల్లో ఉన్నట్లా? లేనట్లా? అంటే లేనట్లే అని సమాధానం వస్తోంది. పేకాట, గుట్కా, గంజాయి, డ్రగ్స్‌పై అధికారులు ఉక్కుపాదం మోపాల్సి ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. గుట్కా అమ్మకాలపై పోలీసులు దాడులు చేసి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఈ విషయంలో నామమాత్రంగానే వ్యవహరిస్తున్నాని తెలుస్తోంది. ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా గుట్కా అమ్మకాలు కొనసాగుతున్నాయి. 2022 సెప్టెంబర్‌లో బడా గుట్కా వ్యాపారులు కోర్టులో కేసు వేసి స్టే తెచ్చుకోవడంతో వ్యాపారం మళ్లీ కొనసాగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇన్ని రోజులు గుట్టుగా నడిచిన గుట్కా దందా ప్రస్తుతం విచ్చలవిడిగా పాన్‌షాపులు, జనరల్ స్టోర్స్, కిరాణా షాపుల్లో గుట్కాలు అమ్మి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు ఒక్క సిద్దిపేట జిల్లాలోనే లక్షలాది రూపాయల గుట్కా వ్యాపారం కొనసాగుతుందంటే ఈ వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా నెలకు కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోందని సమాచారం. కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంటే పోలీసులు, సంబంధిత అధికారులు స్టే పేరుతో తప్పించుకుంటున్నారని, స్టే ఉంటే మాత్రం ఇంత విచ్చలవిడిగా వ్యాపారాన్ని నిర్వహించవచ్చా? ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవచ్చా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు గతంలో గుట్కాలు అమ్మే వారిపై కేసులు నమోదు చేసి, రెగ్యులర్ తనిఖీలు చేసేవారు. ఇప్పుడు వారు కూడా పట్టించుకోవడం మానేశారు. క్యాన్సర్ కారకమైన గుట్కాను ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం నిషేధించింది. స్టే పేరుతో మళ్లీ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడానికి కొంతమంది వ్యాపారస్తులు జోరుగా గుట్కా దందా చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి గుట్కా దందాపై ఉక్కుపాదం మోపి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ - మెదక్



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని విడియో సమావేశ మందిరంలో బుదవారం రోడ్డు సేఫ్టీ కమిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హెల్మెట్‌పై ప్రజల్లో మరింత అవగహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బోర్డ్ లు, సూచికలు, సైన్ బోర్డ్ లు, రేడియం బోర్డ్ లు ఏర్పాటు చేయాలన్నారు. మూలమలుపుల దగ్గర హెచ్చరికల బోర్డ్ లు, స్పీడ్ లిమిట్ బోర్డ్ లు ఏర్పాటు చేసి రోడ్డు గుంతలను పూడ్చి వేయాలన్నారు. స్పీడ్ బ్రేక్ లు ఏర్పాటుచేసి, మద్యం తాగి వాహనాలు నడిపే వారి పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని, రోడ్డు మరమ్మత్తులలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక పౌరుడు తెలుసుకోవాలని, రోడ్డు భద్రత పై బాధ్యత కలిగి ఉండాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందన్నారు. ప్రతి 3 నిమిషాలకు రోడ్డు ప్రమాదాల వల్ల ఒకరు చనిపోతున్నారని తెలిపారు. కొద్ది పాటి నిర్లక్ష్యం ఫలితంగా కుటుంబాలు రోడ్డు పాలవుతాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డు పై వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. రోడ్డు పై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రూల్స్ ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రతగా వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు నిబంధనలను, సూచనలను పాటిస్తూ వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్టీసీ డీఎం సుధ, డిఎంహెచ్ఓ చందు నాయక్, ఎక్సయిజ్ అధికారి రజాక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలలో వందశాతం పన్ను వసూలు కావాలి

- అనుమతి లేని నిర్మాణాలు, కబ్జాలు జరగొద్దు
- పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా సాగాలి
- స్ట్రీట్ వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేయాలి
- ప్రాధాన్యత పనులను వెంటనే ప్రారంభించాలి
- మున్సిపల్ కమిషనర్లు ప్రతిరోజు క్షేత్ర పరిధిలో తనిఖీ చేయాలి
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

నవతెలంగాణ సంగారెడ్డి



జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ఫిబ్రవరి నెలాఖరులోగా వంద శాతం పన్ను వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లతో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పన్ను, కుళాయి బిల్లుల వసూలు, పార్కులు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ తదితర అంశాలపై కలెక్టర్ మున్సిపాలిటీలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో వంద శాతం ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పన్ను, నీటి కుళాయి బిల్లుల వసూళ్ల కావాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పన్ను వసూలు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ల కు సూచించారు. బిల్ కలెక్టర్లవారీగా ఆస్తి పన్ను లక్ష్యాన్ని నిర్ణయించి, రోజువారి వసూళ్ల వివరాల నివేదికను అందించాలని, మొండి బకాయిలు ఉన్నచోట మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పనితీరు బాగలేని బిల్ కలెక్టర్ల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వేతనాలు, విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని సూచించారు. మున్సిపాలిటీలలో ఫుట్ పాత్స్, జంక్షన్లలో ఎక్కడా ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ అనుమతించవద్దన్నారు. మున్సిపల్ కమిషనర్లు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. పట్టణ ప్రజలకు మంచి ఆహ్లాదకరమైన, స్వచ్ఛ వాతావరణం కల్పించాలన్నారు. మున్సిపాలిటీలలోని అన్ని పార్కులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలన్నారు. పార్కుల నిర్వహణ బాగుండాలన్నారు. పార్కులు, పబ్లిక్ టాయిలెట్స్‌ని మున్సిపల్ కమిషనర్లు తనిఖీ చేసి సక్రమంగా నిర్వహణ జరిగేలా చూడాలన్నారు. ప్రతిరోజు ఉదయం 6 నుండి 6 :30 గంటల సమయంలో పారిశుద్ధ్య నిర్వహణ తీరుతెన్నులను క్షేత్ర పరిధిలో తనిఖీ చేయాలని, రెగ్యూలర్‌గా అన్ని వార్డులు సందర్శించి, వార్డు ప్రజలతో ఇంట్రాక్ట్ కావాలని, ఏవేని సమస్యలు దృష్టికి వచ్చినట్లయితే పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా, వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనుమతిలేని నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి కూల్చి వేయాలన్నారు. వీధి వ్యాపారుల కోసం అవసరమున్న చోట స్ట్రీట్ వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ బాగుండాలని, ప్రతి రోజూ ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరగాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరిగేలా పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయాలన్నారు. మున్సిపాలిటీలలోని ప్రాధాన్యత పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంగారెడ్డి, జహీరాబాద్ నారాయణఖేడ్, ఆందోల్- జోగిపేట, సదాశివపేట, బొల్లారం, తెల్లాపూర్, అమీన్పూర్ మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ ఈఈ, డీఈలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

వంద సంవత్సరాలు ఉండాల్సిన ప్రాజెక్టులు

మూడున్నర ఏళ్లకే కుంగిపోవడం విడ్డూరం



- తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం

నవ తెలంగాణ - సిద్దిపేట

'గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెబుతూ నిర్మించిన మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్ట్ లు 100 సంవత్సరాలు ఉండాలి. మూడున్నర ఏళ్లకే ముచ్చటగా కుంగిపోవడం విడ్డూరంగా ఉంది. ఇది కేసీఆర్ కుటుంబం అవినీతికి నిదర్శనం. వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం వృథా చేశారు. ఇందుకు కేసీఆర్ కుటుంబం మూల్యం చెల్లించక తప్పదు' అని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.

బుధవారం కోదండరాం సిరిసిల్ల జిల్లాలో ఓ కార్యక్రమానికి వెళ్తున్న సందర్భంగా సిద్దిపేటలో తెలంగాణ ఉద్యమ నాయకులు, పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో నిర్మించిన ప్రాజెక్టుల భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. మల్లన్నసాగర్ 50 టీఎంసీలకు నిర్మించాలని చూస్తే, ఆ రోజుల్లో ఇంజనీర్లు, ఉద్యమకారులు, జాతీయ సంస్థకు చెందిన భూగర్భ శాస్త్రజ్ఞులు, వ్యతిరేకించారని, ఆ ప్రాంతంలో పగుళ్లు ఉన్నాయని చెప్పారని, అయినా కేసీఆర్ పట్టించుకోలేదని అన్నారు. భవిష్యత్తులో ఏదైనా విపత్తు జరిగితే ప్రజలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని, అందుకు కేసీఆర్ కుటుంబమే కారణమని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల క్షేమం, భవిష్యత్తు కోసం సరియైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టుల పేరుతో చేసిన దోపిడీని క్షుణ్ణంగా పరిశీలించి చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని రిటైర్డ్ ఉద్యోగులు ఆయనకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు, తెలంగాణ జన సమితి నాయకులు ఏ బాపూరావు, సూపర్ ప్రవీణ్, స్వామి, కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి,భైరి ప్రవీణ్ కుమార్, టీజీవో, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగ సంఘ, విద్యావంతుల వేదిక నాయకులు, మల్లారెడ్డి, అశోక్ కుమార్, మధుసూదన్ రెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి బన్సీలాల్, నాయకులు భైరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

భూ పోరాట నాయకులపై

అక్రమ కేసులను ఎత్తివేయాలి

- తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలి
- ప్రభుత్వ భూముల్లోని గుడిసెవాసులకు పట్టాలివ్వాలి
- సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం

నవతెలంగాణ - మెదక్



ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, జగిత్యాల జిల్లాలో పోరాట నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, జైలుకు పంపిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద సీపీఎం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ప్లే కార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని సర్వేనెంబర్ 437లో సుమారు 387 ఎకరాలలో సుమారు 4 వేల మంది ఇండ్లు లేని పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి రెవెన్యూ, పోలీసు అధికారులు దౌర్జన్యంగా జేసీబీ లతో పేదల గుడిసెలను తొలగించి నిప్పుపెడుతున్న తరుణంలో అడ్డుకున్న 30మంది భూ పోరాట నాయకులు, పేదల పై అక్రమ కేసులు బనాయించి 9 మందిని జైలుకు పంపినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు ఇండ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేస్తారని భావించిన పేదల పై నెల రోజులలో దౌర్జన్యంగా దాడులు చేయడం సిగ్గుమాలిన చర్య అని తెలిపారు. తక్షణమే కేసులను ఎత్తివేసి, విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించిన రియల్ ఎస్టేట్ గద్దలజోలికి పోని ప్రభుత్వం, గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదల పై దాడులు దౌర్జన్యాలు మానుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇండ్ల స్థలాలతో పాటు 15లక్షలు ఆర్థిక సహాయం చేసి ఇండ్ల నిర్మాణం కోసం సహకరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నర్సమ్మ, మల్లేశం, బస్వరాజు జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, గీతా నాయకులు లచ్చ గౌడ్, రాములు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విషాదాన్ని మిగిల్చిన సంక్రాంతి పండుగ

నవ తెలంగాణ- రాయపోల్





కుటుంబ సభ్యులందరితో కలిసి సంతోషంగా ఉల్లాసంగా సంక్రాంతి పండుగ నిర్వహించుకుంటుండగా ఓ కుటుంబానికి మాత్రం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా జాతరలో నిర్వహించే ఎడ్లబండ్ల ఊరేగింపులో ప్రమాదవశాత్తు ఎడ్లబండి చక్రాల కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం అనాజీ పూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అనాజీపూర్ గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగకు బయన్న గుండ్ల జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సంవత్సరం కూడా అనాజీపూర్ గ్రామంలో జాతర నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం గ్రామంలో ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఆ ఊరేగింపులో దాసరి మధు, దాసరి స్వామి ఎడ్లబండి ముందు పరిగెత్తుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు దాసరి మధు(24) కింద పడిపోయాడు. అతని పైనుంచి ఎడ్లబండి వెళ్లింది. ఎడ్ల బండి చక్రాలు మధు ఛాతి భాగం పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు మధును చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధు మంగళవారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో ఎడ్లబండ్ల ఊరేగింపులో ప్రమాదవశాత్తు బండి చక్రాల కిందపడి మా కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి దాసరి నాంపల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ రఘుపతి పేర్కొన్నారు.

రంగనాయక సాగర్ ఆయకట్టు

రైతులకు తీపి కబురు

- అనంతగిరి నుంచి 1 టీఎంసీ నీటి పంపింగ్‌కు ప్రభుత్వం ఆదేశం
- 18, 19, 20న పంపింగ్
- 20 నుంచి నీటి విడుదల
- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవ తెలంగాణ - సిద్దిపేట



రంగనాయక సాగర్ ఆయకట్టు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురును అందించింది. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా లేక రాయగా, రెండు రోజుల క్రితం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఫోన్ ద్వారా రైతాంగ పరిస్థితిని వివరించారు. ఈ మేరకు బుధవారం ప్రాజెక్టు నుండి రంగనాయక సాగర్‌లోకి ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 18, 19, 20 తేదీలలో అనంతగిరి రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌లోకి ఒక టీఎంసీ నీటిని పంపింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ లోకి పంపింగ్ చేసిన నీటిని రైతుల సౌకర్యార్థం, యాసంగి పంట కాలానికి పంట నష్టపోకుండా ఈ నెల 20 నుండి కాల్వల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. రంగనాయక సాగర్ లోని నీటి పంపింగ్ కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పట్ల రంగనాయక సాగర్ ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అయోధ్యకు సిద్దేశ్వర స్వామికి ఆహ్వానం



నవతెలంగాణ-ఝరాసంగం

ఈ నెల 22న అయోధ్యలో రామ మందిర్‌లో బలరాముని విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలకు సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి సిద్దేశ్వరానందగిరి మహ రాజ్‌కు ఆహ్వాన ం అందింది. ఈ మేరకు శ్రీ దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, గ్రామస్తుల ఆధ్వర్యంలో వివరాలను ఆశ్రమంలో వెల్లడించారు. దత్త గిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వ మానవ ధర్మ ప్రచారం, వైదిక సేవ, ధర్మ ప్రచారాలను గుర్తించి అయోధ్య శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ వారు ఆహ్వానిం చడం తమ అదృష్టంగా భావిస్తున్నామని ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్, ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం తెలిపారు. గ్రామస్తులు కోట శ్రీనివాస్, రమేష్ పాటిల్, నాగన్న, గొల్ల నరసింహులు, బోయిని ఎల్లన్న, కోట వెంకన్న, వడ్ల సంగమేశ్వర్, ఓంకార్, సుధాకర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ మండలంలో సాధారణ సర్వ సభ్య సమావేశంలో బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పట్లోల సంజీవరెడ్డి పంపిణీ చేశారు. ప్రభుత్వ పరంగా ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు అందే విధంగా చూస్తామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలందరికీ సమానంగా సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసమే పనిచేస్తుందని అన్నారు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటా అని అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్కీమ్ లు వాటి ప్రయోజనలు ప్రజలకు వివరంగా తెలియజెయవలసిందిగా అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, ఎంపీపీ లు సర్పంచులు ఎంపిటిసిలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలి

- రాష్ట్ర సదస్సు పోస్టర్ విడుదల చేసిన టీజెస్ నాయకులు



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షులు పి.తుల్జారెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో ఈ నెల 21న హైద్రాబాద్ ఖైరతాబాద్‌లోని మోక్ష గుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగే 'నియంతను గద్దె దించిన తెలంగాణ ప్రజలకు జేజేలు, రాష్ట్ర విభజన హామీలు కేంద్ర- ప్రభుత్వ వివక్షతపై రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను సంగారెడ్డి ఐబీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతున్న విభజన హామీలు కేంద్రం ద్వారా అమలు చేయించడంలో విఫలం చెందిన బీఆర్ఎస్ అధికారాన్ని తమ సొంత రాజకీయ ప్రయోజనాలకు వాడుకుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా అదే ధోరణి అవలంబించిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కృష్ణ జలాల్లో తెలంగాణ నాయ్యామైన వాటా తేల్చాలని అన్నారు. ఉద్యోగుల విభజన పూర్తి చేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కి పంపాలన్నారు. పెండింగ్ లో ఉన్న రాష్ట్ర స్థాయి సంస్థలను, ఆస్తులను విభజించాలన్నారు. రాష్టంలో హార్టీ కల్చర్ యూనివర్శిటీని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని, ఖాజీ పేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. టీజేఎస్ పార్టీ అధ్యక్షులు కోదండరామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సుకు జిల్లాలోని యువత మేధావులు, ఉద్యమకారులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో తేజస జిల్లా ప్రధాన కార్యదర్శి కూమ్మారి సాయిలు, సమన్వయ కర్త శ్రీధర్ మహేంద్ర, తేజస యువజన సమితి జిల్లా అధ్యక్షుడు డి .పాండు, నాయకులు రాంరెడ్డి , విష్ణువర్ధన్ రెడ్డి, ఈశ్వర్ గౌడ్, ఎం.శశికాంత్. రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

20న జహీరాబాద్‌లో సీపీఐ జిల్లా సమావేశాలు

నవతెలంగాణ-జహీరాబాద్



భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా జనరల్ బాడి సమావేశం ఈ నెల 20న తమ్మడ్‌పల్లి, భారత్ నగర్ లో నిర్వహి స్తున్నట్లు సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సిములు తెలిపారు. బుధవారం సీపీఐ బృందంతో ఆయన సభ వేదికను పరిశీలించారు. అనంతరం సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సిములు మాట్లాడుతూ జరగబోయే జిల్లా జనరల్ బాడి సమావేశానికి ముఖ్య అతిధులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మరయూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మరియూ ఎం ఎల్ ఏ.కునమనేని సాంబశివరావు అదే విధముగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు , సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ ఇ. టి.నర్సింహా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు. వి.ప్రకాశ్ రావు సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలలొద్దిన్ హాజరు అవుతున్నారు. సమావేశంలో పార్టీ స్థితిగతులు పార్టీ బావుశత్ కార్యాచరణ పార్టీ విస్తీర్ణ పై చర్చలు జరుపు కుంటామని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతామని భవిష్యత్ లో ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలపై పోరాటం ఉంటుందని ఆయన అన్నారు .గతంలో ఉద్యమాలు నిర్వహించి అమరులైన వారి అడుగు జడల్లో నడుస్తూ వారి ఆశయల కొరకై పోరాటాలు నిర్వహి స్తామని ఆయన అన్నారు. అందుకని పార్టీ స్థితి గతులపై సమావేశం నిర్వహి స్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అజారోద్దీన్. అఫ్జల్. అసిమ్.రెడ్డి. రవి.దిలీప్ పాల్గొన్నారు.

నిలకడగా తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం

సీపీఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజ్



నవతెలంగాణ-సంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం ఆరోగ్య సమాచారాన్ని హైదరాబాద్ లోని ఏఐజి హాస్పిటల్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ పోతినేని సుదర్శన్‌ను సీపీఎం సంగారెడ్డి జిల్లా నేతలు అడిగి తెలుసుకున్నారు. తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, కె.రాజయ్య ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం కుదుట పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సంగారెడ్డి

కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్, ఎక్సైజ్ కార్యాలయంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, హరికిషన్, సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీష్, ఎక్సైజ్ సీఐలు, మధుబాబు, అశోక్ కుమార్ సుబ్రహ్మణ్యం, సంగారెడ్డి జెడ్పీటీసీ సునీత మనోహర్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణ గౌడ్ కౌన్సిలర్ లావణ్య ప్రభు గౌడ్, మాజీ జెడ్పిటిసి మల్ల గౌడ్, కల్పగురు సర్పంచ్ పాండు గౌడ్ , డాక్టర్ స్వామి గౌడ్ జిల్లా అధ్యక్షులు ఆశన్న ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ మనీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లుగీత వృత్తిని ప్రతిబింబించేలా



బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తిని తెలియజేసే విధంగా కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. గీత కార్మికులు గౌడ సోదరులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి భవిష్యత్తు కల్పించాలని, వృత్తి, రక్షణ కోసం ఉపాధి కోసం జరిగి కార్యక్రమాలలో, మా వంతు సహాయ సహకారాలు అందించి గీతా కార్మికుల గౌడ కులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం సంఘం జిల్లా నాయకులు కృష్ణ గౌడ్, రామా గౌడ్, నరసింహ గౌడ్ వెంకటేశం గౌడ్, అనంతరం గౌడ్, ప్రతాప్ గౌడ్ అనిల్ గౌడ్ అశోక్ గౌడ్ సత్యనారాయణ గౌడ్, యాద గౌడ్, నారాయణ గౌడ్ కృష్ణ గౌడ్ హరీష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలు.. దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-సంగారెడ్డి

టీఎస్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలలో ఐదవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనెల 20 వరకు పెంచామని ప్రాంతీయ పర్యవేక్షకులు ఎం.భీమయ్య తెలిపారు. దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులు అని అన్నారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్ రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 180042545678 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ సాంఘిక సంక్షేమ ప్రతిభ కళాశాలలో

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ సాంఘిక సంక్షేమ ప్రతిభ కళాశాలలో ప్రవేశానికై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెదక్ వెస్ట్ రీజియన్ ప్రాంతీయ సమన్వయకర్త భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 2024 లో పదవ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు అని అన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 1,50,000 రూపాయలు గ్రామాలలో, రెండు లక్షల రూపాయలు పట్టణాలలో నీ వారు అర్హులు. ప్రస్తుతం తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు అని అన్నారు.31/8/2024 నాటికి వయస్సు 17 సంవత్సరములు మించరాదు అని అన్నారు. ఆన్లైన్లో %ంషతీవఱం.ఖఎ.ఱఅ%. దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పరీక్షా తేదీ 4/2/2024 నాడు 10 గంటలకు ఎంపిక చేసిన కేంద్రాల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. హాల్ టికెట్స్ 25/1/24 నుండి 3/2/24 వరకు డౌన్లోడ్ చేసుకోగలరు అని అన్నారు. వివరాల కోసం మీ సమీప ప్రాంతంలోని ప్రతిభ కళాశాల యందు సంప్రదించాల్సిందిగా కోరారు.

గీతం అధ్యాపకుడికి సెర్చ్ పరిశోధనా ప్రాజెక్టు

నవ తెలంగాణ - పటాన్‌చెరు



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో

అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ సుధాకర్ సింఘాకు భారత ప్రభుత్వంలోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్ (సెర్చ్) పరిశోధనా ప్రాజెక్టును మంజూరు చేసినట్టు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నెల్లడించారు.ఛత్తీస్ గడ్ లోని రాయపూర్ జిల్లాలో కృత్రిమ మేధ/ మెషీన్ లెర్నింగ్ ఆధారంగా భూగర్భ జలాల గుణాత్మక, పరిమాణాత్మక మూల్యాంకనం ప్రాజెక్టును, రూ.32.03 లక్షల గ్రాంట్ తో సెర్చ్ రీసెర్చ్ గ్రాంట్ గా 36 నెలల కాల వ్యవధితో మంజూరు చేసినట్టు వివరించారు.భూగర్భ జల వనరుల స్థిరమైన అభివృద్ధి దిశగా భూగర్భ జలాల గుణాత్మక, పరిమాణాత్మక అంచనా కోసం కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ పద్ధతులను ఉపయోగించడంలో డాక్టర్ సింఘాకు ఈ రంగంలో ఉన్న నైపుణ్యం, అధునాతన సాంకేతికతలు ఈ పరిశోధనలో తోడ్పడనున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.క్లిష్టమైన పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో ఇటువంటి పరిశోధనల ప్రాముఖ్యతను గీతం ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం నొక్కిచెబుతూ డాక్టర్ సింఘాను అభినందించినట్టు తెలిపారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, వివిధ విభాగాధిపతులు, పలువురు అధ్యాపకులు డాక్టర్ సింఘాకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్డీవో పాండు
- జోగిపేటలో బైక్ ర్యాలీ



నవతెలంగాణ జోగిపేట

2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని అందోల్ జోగిపేట ఆర్డీవో పాండు సూచించారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం జోగిపేట పట్టణంలోని క్లాక్ టవర్ నుంచి అందోల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20,21 తేదీలలో కొత్త ఓటరు నమోదు కొరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలింగ్ బూత్ లో బీఎల్ఓ లు అందుబాటులో ఉంటారని, ఇప్పటికి ఓటరుగా నమోదుకానీ వారు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆంటోనీ, ఎస్సై అరుణ్ కుమార్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఏ. గోపాల్, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్, ఆయా శాఖల అధికారులు నజీర్, నారాయణ, మేప్మా టీఎంసీ బిక్షపతి గౌడ్ ,వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-అక్కన్నపేట

మండలంలోని గౌరవెల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1998-1999కు చెందినటువంటి ఏడవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించి, వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ దగ్గర విద్య అభ్యసించిన వీరు ఇంతటి స్థాయికి ఎదగడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తన దగ్గర చదువుకున్న విద్యార్థి మంచి స్థాయికి వెళ్తే, వారి తల్లిదండ్రుల కంటే ఎక్కువ ఉపాధ్యాయులు సంతోషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏనుగు మల్లారెడ్డి, శకుంతల, నారాయణ రెడ్డి, చంద్రారెడ్డి, లక్ష్మి నారాయణ, మోహన్ రావు, దేవయ్య, రాజేశం, శంకర్, ఆర్గనైజింగ్ చేసిన విద్యార్థులు సుమలత, బొజ్జపూరీ రాజు, పర్శరామ్, శ్రీనివాస్ రెడ్డి అశోక్ రెడ్డి, అంజలి, భారతి పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



నవతెలంగాణ రాయికోడ్

ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని రాయికోడ్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడ్ లోని తాహాసిల్దార్ కార్యాలయం నుండి చర్చి వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వము ఓటు హక్కు పెత్తందారులకు, భూస్వాములకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని కానీ దేశంలో సామాన్యులకు సైతం ఓటు హక్కును కల్పించిన ఘనత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వల్ల వచ్చిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరులు విధిగా ఓటు హక్కును వినియోగించుకొని ఓటు శాతాన్ని పెంచాలని ఆయన తెలియజేశారు. ప్రజలు డబ్బుకు, మద్యానికి అమ్ముడుపోకుండా నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశం, డిప్యూటీ తాసిల్దార్ విజయ్ కుమార్, ఏఎస్ఐ ఎగ్బాల్ హుస్సేన్, ఆర్ ఐ లు రామ్ చందర్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు

ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలి



నవతెలంగాణ- సదాశివపేట

ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలని బిజెపి రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం సదాశివపేట పట్టణంలో ఎంజి బ్యాంక్వాట్ హాల్‌లో ఉమేష్ కుమార్ మరియు కపిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి హెల్త్ న్యూట్రిషన్ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే, వెయిట్ లాస్ కోసం నియమాలు పాటించాలన్నారు. ఈ రోజుల్లో అనేక రకాల జంక్ ఫుడ్స్ పాశ్చత దేశపు ఫాస్టుపుడ్లు, పిజ్జాలాంటి ఆహారాలు తింటూ అధిక బరువు పెరిగి తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతూ గతంలో మన పెద్దలు నిండు నూరేళ్లు జీవించేవాళ్ళు కానీ నేటి ఆహారపు అలవాట్ల వలన 30, 40 ఏండ్లకే అనేక రకాల రోగాలు అనేకమంది ప్రజలు ఆసుపత్రుల పాలైతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు పొదల మాణిక్యరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నిర్వాహకులు ఉమేష్ సార్,డిస్ట్రిబ్యూటర్ కపిల్ మనంది, నవీన్ సింగ్, అమీత్,నల్ల సాయి, సోమశంకర్, మాహూరం నిషా పాల్గొన్నారు.

కామ్రేడ్‌కు నివాళులర్పించిన భనుప్రకాష్



నవతెలంగాణ-జగదేవపూర్

ఉమ్మడి జగదేవపూర్ మండలం పరిధిలోని అంగడికిష్టపూర్ గ్రామ మాజీ సర్పంచ్ సీనియర్ కమ్యునిస్టు నాయకుడు కామ్రేడ్ కోమిరెడ్డి నారాయణ రెడ్డి మృతి తీరని లోటు అని ఆయన మృతి దిగ్భ్రాంతి కలుగజేసిందని తిగుల్ గ్రామ సర్పంచ్, గజ్వేల్ నియోజకర్గ యువజన మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు కప్పర భాను ప్రకాశ్ రావు అన్నారు. అనంతరం ఆయనకు సంతాపం తెలిపారు. కామ్రేడ్ రెడ్డితో కలిసి ఎన్నో విషయాలు, ఒడిదుడుకులు గుర్తు చేసుకున్నారు. బాదాతప్త హృదయంతో పూలమాల వేసి నివాళులుర్పించారు. ఈ సంతాప కార్యక్రమంలో కడప్పల్ల కృష్ణా రెడ్డి, బునారి రాజు, చట్లపలి వెంకట్ బునారి వెంకట్ బాబ్రాల రాజు బబ్లూ తదితరులు ఉన్నారు.

కళాశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

- మెదక్ ప్రాంతీయ పర్యవేక్షకులు భీమయ్య



నవతెలంగాణ జోగిపేట

తెలంగాణ సాంఘిక సంక్షేమ ప్రతిభ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని మెదక్ ప్రాంతీయ పర్యవేక్షకులు భీమయ్య తెలిపారు. బుధవారం జోగిపేటలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం 2024 లో పదవ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ .1,50,000 రూపాయలు గ్రామాలలో, రూ .2 లక్షల రూపాయలు పట్టణాలలోనీ వారు అర్హులన్నారు. ప్రస్తుతం తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు అని, 31/8/2024 నాటికి వయస్సు 17 సంవత్సరములు మించరాదన్నారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగల రాన్నరు. పరీక్షా తేదీ ఫిబ్రవరి 4న 10 గంటలకు ఎంపిక చేసిన కేంద్రాల్లో నిర్వహించబడును అన్నారు. హాల్ టికెట్స్ 25/1/24 నుండి 3/2/24 వరకు డౌన్లోడ్ చేసుకోగలరన్నారు. మరిన్ని వివరాల కోసం మీ సమీప ప్రాంతంలోని ప్రతిభ కళాశాల యందు సంప్రదించగలరని ఆయన కోరారు.

గురుకులాల్లో ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలలో ఐదవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనెల 20 వరకు పొడిగించారని ఆయన తెలిపారు. దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి, మెరిట్ రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు 18004254567 8 టోల్ ఫ్రీ నెంబర్ సంప్రదించాలని ఆయన సూచించారు.

బర్కత్ అలీ కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-కోహీర్

మండల కేంద్రమైన కోహీర్‌లో కాంగ్రెస్ నాయకుల మాజీ కో-ఆప్షన్ మెంబర్ అశ్రఫ్ అలీ గారు సోదరుడు బర్కత్ అలీ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకోని కుటుంబ సభ్యులను మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్ పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మెంబర్ హర్షత్ శంసురల్లికాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలి

• జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్

మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి, నిఘా పెట్టాలని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో మత్తు పదార్థాల రవాణా అరికట్టాలని జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, పాఠశాల, కళాశాలల యువతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో పని చేస్తున్న వారిని పసిగట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, కిరణా, మెడికల్ షాప్‌లపై నిఘా పెంచాలన్నారు. కిరణా షాపులలో అమ్మే చాక్లెట్స్, ఇతర తిను బండారాలను పరిశీలించాలని, పారిశ్రామిక ప్రాంతాల్లో అధికారులు పర్యటించాలని, మెడికల్ షాపుల దగ్గర సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి సాగు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత తెలిసీ తెలియక మత్తుకు బానిసై బంగారంలాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. యువత డ్రగ్స్, కొకైన్, గంజాయి లాంటి మత్తు పదార్థాల వల్ల చాలా అనర్థాలు కలుగుతాయన్నారు. ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను తెలుసుకోవాలని, పిల్లల ప్రవర్తనలో మార్పు అనిపిస్తే పోలీస్ శాఖ వారిని సంప్రదించాలని సూచించారు. అదనపు కలెక్టర్ రమేష్, అదనపు ఎస్పీ మహేందర్, డీఈఓ రాధాకిషన్, డిఐఈఓ సత్యనారాయణ, ఎక్సయిజ్ అధికారి రాజక్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వరుస దొంగతనాలు

• పోలీసు ఉద్యోగంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఏఎస్ఐ?
• ముడుపులు తీసుకుని దొంగను వదిలేసిన ఏఎస్ఐ?





నవతెలంగాణ-కౌడిపల్లి

గత రెండు నెలల నుంచి కౌడిపల్లి మండలంలో ఏదో ఒక గ్రామంలో వరుస దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు పట్టించుకోకపోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని 29 గ్రామపంచాయతీలు ఉండగా చిన్నచిన్న గ్రామాల్లో దొంగతనాలు అవుతుండడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. యాసంగి వరి నాట్లు ప్రారంభం కావడంతో ఇళ్లకు తాళాలు వేసి వ్యవసాయ పొలాలకు వెళుతుండడంతో దొంగలు పట్టపగలే తాళాలు పగలగొట్టి నగదును, విలువైన వస్తువులను దొంగలిస్తున్నారు. గత రెండు నెలల క్రితం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన సాకలి బాలయ్య, నీల పోయిన మల్లయ్య, పాపయ్యలు నగదు తో పాటు విలువైన వస్తువులు పోయాయని వాపోయారు. తునికి గ్రామానికి చెందిన మన్నె శ్రవణ్ కిరణా షాప్ , దేవగోని రాజా గౌడ్ కిరాణా షాప్‌లలో నగదును, గొల్ల రాజు బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. కొన్నెల దత్తి, చల్ల వెంకటేశం, సాహెబ్, అంబురి లక్ష్మి, ఇళ్లల్లో నగదును విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారని బాధితులు తెలిపారు. కౌడిపల్లి ఎల్లమ్మ గుడి వద్ద రెండు సార్లు హుండిని పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. గత రెండేళ్ల క్రితం భవన నిర్మాణ కార్మికుడు గౌరి చర్ల ప్రశాంత్‌కు సంబంధించిన సెంట్రింగ్ పిల్లర్ బాక్సులు 40 ఎత్తుకెళ్లగా వాటిని హైదరాబాద్‌లోని ముషీరాబాద్ షాప్‌లో దొంగలు అమ్మినారు. షాపు యజమానిని పోలీస్ స్టేషన్‌లోకి పిలిపించి ఏఎస్ఐ శ్రీనివాస్ షాప్ యజమాని వద్ద లంచం తీసుకొని ప్రశాంత్‌కు తిరిగి 40 డబ్బాలు ఇప్పించారు. అమ్మిన వారు ఎవరో తమకు తెలవాలని భవనిర్మాణ కార్మికులు ఏఎస్ఐని ఎంత అడిగినా సమాధానం ఇవ్వలదు. విట్టల్ రెడ్డి కాలనీలో ఒక ఇల్లు నిర్మాణం చేస్తున్న రెడ్డి రమేష్‌కు సంబంధించి 150 సెంట్రింగ్ బాక్సులు, ఎల్లమ్మ గుడి వద్ద తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు పిల్లర్ బాక్సులు 36, బట్టమ్మ గుడి దగ్గర నుంచి ధర్మారం రాములకు చెందిన 50 సెంట్రింగ్ బాక్సులు, స్మశాన వాటిక దగ్గర గొల్ల మల్లేష్ యాదవ్ 100 బాక్సులు, వెల్మకన్నె స్మశాన వాటిక దగ్గర నుంచి గౌడి చర్ల వెంకటేశంకు చెందిన 70 సెంట్రింగ్ డబ్బులు, కొల్చారం మండలం అంసనపల్లి ఇంటి నిర్మాణం దగ్గర జావిద్‌కు చెందిన 60 సెంట్రింగ్ బాక్సులు ఎత్తుకెళ్లారని భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షులు వెంకటేశ్వరరావు తెలిపారు. దాదాపు వీటి విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందని, బాధితులు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ముషీరాబాద్‌లో అమ్మిన వ్యక్తులు సీసీ కెమెరాల్లో కనబడతారని భవన నిర్మాణ కార్మికులు ఏఎస్ఐ శ్రీనివాస్‌ను ప్రశ్నించినా ఆయన నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు. దొంగలను కాపాడడానికి ఏఎస్ఐ భారీగా ముడుపులు తీసుకొని వదిలేయడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఆ సారు ఉద్యోగంలో ఉంటే పిటిషన్ ఇవ్వడానికి కూడా ప్రజలు భయపడుతున్నారన్నారు. పంచాయతీలు సెటిల్మెంట్లు తాను లేనప్పుడు రావద్దని నాయకులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు. ఆయన డ్యూటీలో ఉన్నప్పుడే రావాలని సమాచారం ఇస్తారు. ఇలాంటి అధికారుల పైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని పోలీసు వ్యవస్థకు మచ్చ తెచ్చే పోలీసులను శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు. సామాన్య ప్రజలు పిటిషన్ ఇవ్వడానికి వస్తే రూ.500 నుంచి రూ.1000ల వరకు తీసుకుంటారని బాధితులు వాపోతున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్ఎల్‌సి నర్సింహ

నవతెలంగాణ-మెదక్

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లో (టి ఎమ్ఆర్ఈఐఎస్) వచ్చే విద్యా సంవత్సరానికి వివిధ తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్ఎల్‌సి (రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్) డాక్టర్ నరసింహ బుధవారం తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని, విద్యార్థి ఆధార్ కార్డు, ఫోటో, సంతకం ఉండాలని తెలిపారు. ఆన్ లైన్ ద్వారా లేదా టిఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేయవచ్చని పేర్కొన్నారు. సందేహాలకు 040 23437909కు ఫోన్ చేయవచ్చని లేదా ఉమ్మడి మెదక్ జిల్లాలోని మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. 5వ తరగతి మైనారిటీ విద్యార్థులకైతే ముందు వచ్చిన వారికి సీట్లు కేటాయిస్తారని, ఇతరులకు లక్కీ డ్రా ద్వారా సీట్లు కేటాయిస్తారని తెలిపారు. 6,7,8 తరగతులు (ఖాళీలు ఉంటేనే) మొదటగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం (జనరల్, ఒకేషనల్) పదవ తరగతిలో విద్యార్థుల మెరిట్ ఆధారంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్ విద్యార్థులకి ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు.

కే వెంకటాపూర్‌లో శ్రీరాముని అక్షింతలు పంపిణీ



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కే వెంకటాపూర్ గ్రామంలో సర్పంచ్ అనిల్ కుమార్ శ్రీరాముల అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముల గుడి ప్రారంభోత్సవం సందర్భంగా విగ్రహ ప్రతిష్టాపన జరుగుతున్నందున దేశంలో ప్రతి గ్రామంలో శ్రీరాముల అక్షింతలు పంపిణీ చేస్తున్నారన్నారు. వెంకటాపూర్ గ్రామంలో కూడా ప్రతి ఇంటికి శ్రీరాముల అక్షింతలను పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సోమన్న కిష్టయ్య, నందు, రాజేందర్, సాయిలు, రాజలింగం గౌడ్, స్వామి, బన్నీ, అశోక్ ,వికాస్, తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ పార్టీ కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి



తూప్రాన్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

బీఆర్ఎస్ పార్టీ గురువారం గజ్వేల్‌లో నిర్వహించే కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని తూప్రాన్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్ రెడ్డి కోరారు. కేసీఆర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గజ్వేల్ నియోజకవర్గం నుంచి గెలిచిన సందర్భంగా గజ్వేల్‌లోని శోభ గార్డెన్‌లో గురువారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ కృతజ్ఞత సభను నిర్వహించనున్నదని తెలిపారు. ఈ కృతజ్ఞత సభకు అందరి అభిమాన నాయకులు తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని బాబుల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష, రూ.2000ల జరిమానా

నవతెలంగాణ-హవేలి ఘనపూర్

మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడ్డ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష, రూ.2000 జరిమానా విధించినట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ బుధవారం తెలిపారు. మెదక్ పట్టణంలోని స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి బి కల్పన నిందితుడికి శిక్ష విధించినట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు హవేలీ ఘనపూర్ మండలం స్కూల్ తండాకు చెందిన కేతావత్ మోహన్‌ను మంగళవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుకున్నట్లు కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు.

కేంద్ర పథకాల కోసం బ్యాంకు ఖాతాలు అవసరం



నవతెలంగాణ-తొగుట

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం బ్యాంకు ఖాతాలు ఎంతో అవసరం ఉంటుందని సర్పంచ్‌లు సిలివేరి జ్యోతి మల్లారెడ్డి, పాతుకుల లీలదేవి వెంకటేశం, బొడ్డు నర్సింలు, ఎంపీటీసీ కంకణాల నర్సింలు తెలిపారు. బుధవారం మండలంలోని జప్తి లింగారెడ్డి పల్లి, వెంకట్రావు పేట గ్రామాలలో వికాసత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం బ్యాంకు ఖాతా తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. బ్యాంకుల వల్ల ఉపయోగాలు, ఖాతాను ఎలా వాడాలి, కుటుంబ బడ్జెట్, వ్యక్తి బడ్జెట్, బ్యాంక్ ఖాతా రకాల గురించి వివరించారు. ఈ-కెవైసి, నామినీ ప్రాముఖ్యత, భీమా రకాలు, పీఎం ఎసిబివై (ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన), పిఎంజెజె బివై (ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన), ఏపీవై (అటల్ పెన్షన్ యోజన), ఎస్ఎస్‌వై (సురక్ష సమృద్ధి బీమా యోజన) ఉజ్వల, ఆయు ష్మాన భారత్, విష్వకర్మా యొజన పలు మొదలగు భీమా రకాలు, రుణాలు, రైతులు పంట రుణాలు, ముద్రా రుణాలు, వ్యక్తిగత రుణాలు, డిజిటల్ లావా దేవీలు, రూపాయి ఎటిఎం కార్డ్ యుటిలిటీస్ గురించి చర్చించినట్లు తెలిపారు. వాటా, అంబుడస్మెన్ ప్రాముఖ్యత "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" ఆర్థిక అక్షరాస్యత శిబిరం ప్రాముఖ్యత మొదలైన వాటి గురించి వివరించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ భరత్ కుమార్, వైద్య అధికారి రాదకిషన్, ఆయుష్ డాక్టర్ సుభాషిని, హెల్త్ సూపర్వైజర్ శ్యామల, ఏఎన్ఎం రాములు, లక్ష్మి, పశు వైద్య అధికారి రాజేందర్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి వంశీ, బిపిఎం నర్సింలు, వ్యవసాయ అధికారి మోహన్, ఏఈఓ నవీన్, పంచాయితీ కార్యదర్శి వేలాద్రి, నర్సింలు, ఉపసర్పచ్‌లు సురేష్ గౌడ్, గణేష్ గౌడ్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఎఫ్ఏలు, వివోలు, సిఎఫ్ఎల్ కో ఆర్డి నేటర్స్ బి.స్వామి, ఏ.శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జాగృతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



నవతెలంగాణ- గజ్వేల్

జాగృతి తెలుగు వారపత్రిక వారు ప్రచురించిన జగదానందకారక (రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ ప్రత్యేక సంచిక) పుస్తకాలకు పూజా, ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం గజ్వేల్‌లోని శ్రీకృష్ణ ఆలయంలోని రామమందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ జాగృతి మాసపత్రిక వారు అయోధ్యలో నిర్మించిన శ్రీరాముని ఆలయం గురించి ప్రత్యేకంగా ప్రచురించిన సంచిక బాగుందన్నారు. ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాగృతి మాస పత్రిక యాజమాన్యానికి శ్రీరామ కృపా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. డాక్టర్ నరేష్ బాబు మాట్లాడుతూ జాగృతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణకు వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క హైందవ సోదర సోదరీమణులందరికీ ధన్యవాదాలు తెలిపారు. జాగృతి మాస పత్రికలో అయోధ్య రామజన్మ భూమిలో రామమందిరం 500 ఏళ్ల చరిత్రకు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రస్తావించారన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గల మురళీ కృష్ణాలయం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డీవైఆర్ యువసేన ఆధ్వర్యంలో పతంగుల పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి యువసేన ఆధ్వర్యంలో బుధవారం పతంగుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ చెలికాని యాదగిరి యాదవ్, జంగిటి శ్రీనివాస్ హాజరయ్యారు. పిల్లలకు పతంగులను పంపిణీ చేసి పతంగుల ఎగురవేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఆనందంతో జాగ్రత్తలు పాటిస్తూ పండుగను నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

• మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి

నవతెలంగాణ-కొల్చారం

క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో యువత ముందుకు సాగి లక్ష్యాలను చేరుకోవాలని నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి అన్నారు. గత వారం రోజులుగా రంగంపేట గ్రామంలో జరిగిన ఆర్పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీల్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహిస్తున్న సంగారెడ్డి వాస్తవ్యులు కానుకంటి రాజు జ్ఞాపకార్థంగా ఆయన సతీమణి అనురాధ, కూతురు భవ్య శ్రీ, కుమారుడు సాయి చరణ్‌లు కీడాకారులను ప్రోత్సహిస్తూ రంగంపేటలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటకు తమ వంతు సహకారం అందించడం సంతోషకరమన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన టీంలకు ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగంపేట సర్పంచ్ బండి సుజాత రమేష్, ఎంపీటీసీ గోకని మాధవి రాజా గౌడ్, ఉప సర్పంచ్ మచ్చ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్, బీఆర్ఎస్ నాయకులు ముత్యంగారి సంతోష్ కుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్ తుక్కాపూర్ ఆంజనేయులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిట్కుల సురేశ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, మాజీ చైర్మన్ వంజరి మల్లేశం, డైరెక్టర్ దుర్గేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణలో ఐటి రంగాన్ని అభివృద్ధి పర్చడమే లక్ష్యం

• మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

నవతెలంగాణ-మెదక్

తెలంగాణా రాష్ట్రంలో ఐటి రంగాన్ని మరింతగా అభివృద్ధి పర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు పేర్కొన్నారు. దావోస్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, ఐటి, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబును మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దావోస్‌లో ప్రపంచ ఎకానమిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరుగు తున్న సమావేశాల్లో పెట్టుబ డులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు తెచ్చేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం త్రీ సీస్ కంపెనీ సిఇఓ ఫ్రాన్సితో పెట్టుబడులపై చర్చించారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ రివోల్యూషన్ స్పెస్, ఫ్యూచర్ టెక్నాలజీపై సదస్సులో చర్చించారు.





వెంకట్రావుపేటలో అయోధ్య అక్షింతల వితరణ



నవతెలంగాణ-తొగుట

అయోధ్య అక్షంతలను గడపగడపకు పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో భక్తులు అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలను గడపగడపకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ భక్తులు శ్రీరామ జయరామ జయ జయ రామ నామ సంకీర్తనతో గ్రామంలో తిరుగుతూ గడపగడపకు అక్షింతలను పంపిణీ చేశారు. అయోధ్యలో శ్రీరామ జన్మ భూమిలో నిర్మించిన ఆలయంలో ఈ నెల 22న శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని గ్రామాలలో ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించాలని వారు సూచించారు. అయోధ్య అక్షింతలను శుభ కార్యాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకొని సాయంత్రం ప్రతి ఇంటిలో 5 దీపాలను వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో రామభక్తులు రమేష్, నర్సింలు, సత్యనారాయణ, శ్రీనివాస్, మల్లయ్య, ఆంజనేయులు, ప్రభాకర్, పెంటోజీ, సందీప్, జంగీర్, కృష్ణ, దయాకర్, సుదర్శన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో పంచాయితీ భవనం లేకపాయె

• అద్దె భవనంలో గువ్వలేగి పంచాయితీ కార్యాలయం
• మూడేళ్ల క్రితం మాజీ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన
• నేటికీ పూర్తి కాని భవన నిర్మాణ పనులు
• అర్ధాంతరంగా నిలిచినా పట్టించుకోని పాలకులు







నవ తెలంగాణ-దౌల్తాబాద్

స్వపరిపాలనలో గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసుకుంటామని కలలుగన్నారు. పంచాయతీ హెూదాతో పాటు సమస్యలు నెరవేరుతాయని, సొంత భవనాల నిర్మాణం జరుగుతుందని ఆశపడ్డారు. పంచాయతీ హెూదా వచ్చి యేండ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాల కల్పనకు నోచుకోవడం లేదు. మండలంలోని గువ్వలేగి గ్రామపంచాయతీ భవన నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనులు నిలిచి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పదేళ్ల తెలంగాణ స్వయంపాలనలో పక్కా గ్రామ పంచాయతీ భవనం లేక నేటికీ గ్రామ పంచాయతీలు అవస్థలు పడుతున్నాయి. మండల పరిధిలోని గువ్వలేగి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం లేక పాలకవర్గం గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో మాజీ శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసినప్పటికీ నిధుల లేమితో నేటికి నిర్మాణ పనులు పూర్తికాక పిల్లర్ల దశలోనే పంచాయతీ భవనం దర్శనమిస్తుంది. ఫలితంగా ఒక పాత ఇంట్లో గ్రామపంచాయతీ కార్యాలయం కొనసాగుతుంది. శంఖుస్థాపన చేసి మూడు సంవత్సరాలైనా నాటి అధికార బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం వల్ల పిల్లర్ల దశలోనే గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. అద్దె భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తూ నామమాత్ర ఫర్నిచర్‌ను ఏర్పాటు చేసినా సమావేశాలకు స్థలం సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీలను ఏర్పాటు చేసి యేండ్లు కావస్తున్నా భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయకపోవడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని ధర్మారం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ ఊట్ల రవీందర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో నూతనంగా గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, ఉప సర్పంచ్ జయకర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు..

రామకోటి ముగ్గులపోటీ విజేతలకు బహుమతుల ప్రధానం

•రామకోటి సంస్థ సేవా కార్యక్రమాలు అద్భుతం
•ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి

నవ తెలంగాణ- గజ్వేల్

హిందువులు పవిత్రంగా నిర్వహించుకునే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో తాలూకాస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో 436 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి వేములవాడ చందన, ద్వితీయ బహుమతి తీర్థాల విజయలక్ష్మీ, తృతీయ బహుమతి ప్రొద్దుటూరి ప్రేమావతి విజేతలుగా నిలిచారు. వీరికి ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి బుధవారం కృష్ణాలయంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి మాట్లాడుతూ తెలుగు సాంస్కృతిక, సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ముగ్గులు ఉన్నాయన్నారు. రామకోటి సంస్థను స్థాపించి ధార్మిక, సామాజిక కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తున్న రామకోటి రామరాజు కృషి, పట్టుదల ఆమోఘమని అభినందించారు. 50 మందికి కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేశారు. సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు, కృష్ణాలయం అధ్యక్షులు ఎలగందుల రాంచంద్రం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, ధార రాంచంద్రం, ఉప్పల మధు, నేతి నాగేంద్రం పాల్గొన్నారు.



రెండు వాహనాలు ఢీ, ఒకరు మృతి



నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ శివారులో ఒక లారీ ఎం.హెచ్ 26 బి 9128, మరోవాహనం కారు 23 బీహెచ్ 2210ల్ లు ఎదురెదురుగా ఢీకొనగా కారులో ఉన్న డ్రైవర్ అమర్దీప్ అక్కడికక్కడే కారులో ఇరుక్కుని చనిపోయినాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి చిరాకుపల్లి పోలీసులు చేరుకొని విచారణ జరుపుతున్నారు.

శుభ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-తొగుట

బారసాల కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు పాల్గొన్నారు. బుధవారం బీజేపీ నాయకులు స్వామి కుమారుని బారసాల కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాధవ నేని రఘునందన్ రావు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అయన వెంట బీజేపీ అధ్యక్షుడు, తుక్కాపూర్ సర్పంచ్ చిక్కుడు చంద్రం, వెంకట్రావు ఎంపీటీసీ కంకణాల నర్సింలు, చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింలు, నాయకులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The general public hereby informed that of **BODASU LAXMI W/O. RAMULU** aged about 50 years, Occ. House Wife R/O. Potha rajpally H/o.Ravelly Village, Toopran Mandal, Medak Dist., has approached the Shriram Finance Ltd., Medchal Branch, Hyderabad by put his documents by way of mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections. Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to informed that of **BODASU LAXMI W/O.RAMULU** and no claim or no objection of any kind thereafter will be entertained.

SCHEDULE OF THE PROPERTY

All that the Open Plot in Sy.No. 228/A, admeasuring the area of 116.16 Sq. Yds., Situated at Potha rajpally, Ravelly Village, Toopran Mandal, Medak Dist., and bounded by:

NORTH: 9 feet Wide Road.
SOUTH: 10 Feet Wide Road
EAST: 9 Feet Wide Road
WEST: Plot of B.Ramulu

By
R.VENKATESHWAR RAO
Advocate,
5-3-29, Near Ramlayam Temple,
Kukatpally, Hyderabad-72
Cell 9391093566/8519985749

సర్పంచుల పదవీకాలం పెంచండి



నవతెలంగాణ-అక్కన్నపేట

మండలంలోని సర్పంచులంతా అప్పుల పాలై అనేక ఇబ్బందులు పడుతు న్నారని, పదవి కాలాన్ని పెంచాలని ఎంపీడీవో సత్యపాల్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ 01-02-2024 వరకు ఐదు సంవత్సరాల పదవీకాలం ముగుస్తుందని, అయినా పెండింగ్ బిల్లులు ఏది కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేము సర్పంచ్ అయ్యాక 8 నెలల వరకు ప్రభుత్వం చెక్ పవర్ ఇవ్వలేదని, అలాగే కరోనా వల్ల రెండు సంవత్సరాల పదవీకాలం వృధాగానే పోయిందని తెలియజేశారు. అంతేకాకుండా రాష్ట్ర అభివృద్ధికి కేటాయించే ఎస్ఎఫ్‌సి నిధులు రాక 25 నెలలు గడుస్తోందని, మండలంలోని 32 గ్రామాల సర్పంచులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. కాబట్టి ప్రభుత్వం దయతలచి పెండింగ్ నిధులు వచ్చేవరకు పదవి కాలాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దుబ్బాక

అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చౌదరిపల్లి గ్రామంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.13 లక్షలు,సీడీపి నిధులు రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సర్పంచ్ కుమ్మరెంకు కుమార్, ఉప సర్పంచ్ అచ్చంగారి అరుణ ఇస్తారి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జడ్పిటిసి కడ్తాల రవీందర్ రెడ్డి, ఏఎంసి చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అంతకుముందు చౌదరిపల్లిలో వెలసిన స్వయంభూ పార్వతి దుబ్బరాజేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బలమూరి వెంకట్‌కు అభినందనలు



నవతెలంగాణ-సిద్దిపేట

ఎమ్మెల్యే కోటలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబడుతున్న ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు బలమూరి వెంకట్‌ని కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశామని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి రాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని, రాష్ట్ర అధ్యక్షుడు బలమూరి వెంకట్ విషయంలో నిరూపితమైందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేష్ యాదవ్, నాయకులు రాకేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొండపాక మండలానికి నీటిని విడుదల చేయాలి





నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండల రైతుల పంట పొలాలకు తపాస్‌పల్లి డి 4 కెనాల్ కాలువ నీటిని అందించేలా ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూమ్ రెడ్డి అన్నారు. తపస్‌పల్లి నుంచి కొండపాక మండలానికి వచ్చే డి 4 కాలువను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యాసంగి పంట చేతికి రావాలంటే కాల్వల ద్వారా చెరువులలోకి సాగునీరు అందకపోతే పంటలు పండగ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. యాసంగి నాట్ల మొదలు దశలోనే అరా కొరా సాగు చేస్తే కోతల దశలో కన్నీరు మిగిలేలా ఉందన్నారు . రైతులను కడుపులో పెట్టుకుని చూసేలా సిఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని పదకొండు గ్రామాలకు 2011లో సాగునీరు అందించేందుకు అప్పటి ప్రభుత్వం తపస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా డి 4 కెనాల్ పేరుతో కాలువ నిర్మాణాలు చేపట్టి తాగునీటి సరఫరా చేసి ఆయా గ్రామాల చెరువులను నింపారన్నారు. వేసవిలో సైతం నిండు కుండల చెరువులు ఉండేవన్నారు. దాంతో పంటలు పండి రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. ఎప్పటికప్పుడు అధికారుల పర్యావెక్షణలో ప్రతి గ్రామానికి సాగునీరు అందించారన్నారు. కొద్ది రోజులుగా కాలువలను ఎవరు పట్టించుకోక పోవడంతో గండ్లు పడి, పూడికలు నిండి నీటి పారుదలకు అంతరాయం ఏర్పడినట్లు రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సాగునీరు సరైన విధంగా అందక ఏర్పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని వెంటనే కాలువల ద్వారా నీరు అందించే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. మండలంలోని నీరు అందాలంటే కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామ శివారులలో ఉన్న పూడికతీత పనులను అధికారులు వెంటనే పరిశీలించి ప్రారంభించాలని కోరారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక

కాంగ్రెస్ పార్టీ లీడర్లకు బీఆర్ఎస్ మీద కోపముంటే తమతో కొట్లాడాలని, కానీ రైతులను మాత్రం ఇబ్బంది పెట్టొదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. పొలాలు ఎండకముందే కాలువల్లో నీళ్ల ఇవ్వాలని కోరారు. బుధవారం మండల పరిధిలోని వెంకటగిరి తాండలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.20 లక్షలు, ఎంపీ లాడ్స్ నిధులు రూ.5 లక్షల వ్యయంతో శిలాజీ నగర్ గ్రామంలో ఎంఎన్ఆర్ఈజిఎస్ నిధులు రూ.20 లక్షల వ్యయంతో, అచ్చుమాయిపల్లి గ్రామంలో ఎమ్ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.13 లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను సర్పంచ్లు పాతులోత్ పెంటమ్మ బాలకిషన్, మాదూరి శ్రీనివాస్, సోమారపు స్వప్న స్వామి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జడ్పిటిసి కడ్తాల రవీందర్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆదివాసి, లంబాడీలను పట్టించుకున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ సర్కారు మాత్రమేనని, కేసీఆర్ హయాంలోనే తండాలను గ్రామపంచాయతీలుగా మార్చారని గుర్తు చేశారు. ప్రపంచమే నివ్వెరపోయేలా కేసీఆర్ ప్రాజెక్టులను నిర్మించారన్నారు. నేటి కాంగ్రెస్ సర్కారు కూడవెల్లి వాగులో నీళ్ల విడుదల చేయమంటే జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా పంటల సాగుకు మల్లన్న సాగర్ కాలువల ద్వారా నీళ్ల విడుదల చేయాలని ఇటీవలే మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశానన్నారు. బీఆర్ఎస్ అధికారంలో లేకున్నా ప్రజల పక్షాన ఉంటూ పోరాడుతామన్నారు. మల్లన్న సాగర్ కాలువల్లో భూములు పోయే వారికి తగిన నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఏఎంసీ చైర్మన్ చింతల జ్యోతి కృష్ణ, పలువురు సర్పంచులు జనార్దన్ రెడ్డి, భాస్కర్, ఎంపిటిసి ఎల్.రాంరెడ్డి, ఉప సర్పంచ్‌లు మోహన్, శంకర్ నాయక్, పర్స దేవరాజ్ ముదిరాజ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోధ్య ఉత్సవానికి డా.అరవింద్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవం అద్భుతమని సిద్దిపేట జిల్లా టీఎన్జీవోల సంఘం అధ్యక్షులు, అమర్నాథ్ సేవా సమితి నేత గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. సిద్దిపేట వ్యాస మహర్షి యోగ కేంద్రంలో బుధవారం అయోధ్య రామ మందిర్ ఉత్సవానికి ప్రత్యేక ఆహ్వానితునిగా ఎంపికైన ప్రముఖ వైద్యులు అభినందన సమావేశంలో మాట్లాడుతూ శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ వారిచే సిద్దిపేట జిల్లా నుంచి అరవింద్‌ను ప్రత్యేకంగా ఆహ్వానింపబడడం గర్వకారణమన్నారు. ఏ రంగంలో అయినా సిద్దిపేట జిల్లా తన ప్రత్యేకతను నిలుపుకుంటుందన్నారు. అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠ ఉత్సవంలో దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు, ప్రతినిధులకు అన్నదానం చేసే మంచి అవకాశం అమర్నాథ్ సేవా సమితికి లభించిందని తెలిపారు. సీనియర్ పాత్రికేయులు అంజయ్య, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్‌లు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, ధర్మంలపై పాశ్చాత్య మార్కెట్ సంస్కృతి దాడులు చేస్తుందని, ఈ నేపథ్యంలో ప్రజలందరూ ఏకీకరణ కావడానికి దోహదం చేసే ఏ అంశమైనను ఆహ్వానించాలన్నారు. ఈ సందర్భంగా వ్యాసమహర్షి యోగ సొసైటీ గౌరవ చైర్మన్ డాక్టర్ అరవింద్ ను సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించినందుకు ట్రస్టు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మొదటి నుంచి నన్ను అభిమానిస్తూ నా వంతుగా సమాజానికి సేవ చేసే అవకాశాన్ని కల్పించిన ప్రతి ఒక్కరికి ఎల్లప్పుడూ తాను రుణపడి ఉంటానని అన్నారు. జీవితంలో ఇంత గొప్ప అవకాశం నాకు వస్తుందని ఎన్నడూ అనుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ యోగశిక్షకులు తోట సతీష్ , తోట సంధ్య, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు రఘువరన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి , యుటిఎంఎ రాష్ట్ర అధ్యక్షులు లక్కిరెడ్డి విజయ శుబాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది శివాజీ, యోగా అసోసియేషన్ సభ్యులు చిప్ప ప్రభాకర్, రాజమల్లు, గంగాపురం శ్రీనివాస్, బసవరాజు కుమార్, లింగమూర్తి , శారద, హరి ప్రసాద్, పతంజలి యోగ సమితి శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కృతజ్ఞత సభకు ఎమ్మెల్యే హరీశ్‌రావు రాక

మాజీ ఎఫ్డిసిన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

గురువారం ఉదయం 10 గంటలకు గజ్వేల్ పట్టణంలోని శోభా గార్డెన్‌లో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కృతజ్ఞత సభ ఉంది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులను కార్యకర్తలు, నాయకులను ఈ సందర్భంగా కోరారు.

నేతాజీ పూర్వ విద్యార్థుల ఉదారత



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి తమ పాఠశాల పట్ల ఉన్న ప్రేమని, ఉదారత చాటుకున్నారు సిద్దిపేట నేతాజీ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు. పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సునీత అనే టీచర్ కుమారుడికి బ్లడ్ క్యాన్సర్ ఉంది. అతడు ప్రస్తుతానికి హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తమకు ఆర్థిక సహాయం అందించాలని సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులను చూసిన పాఠశాల పూర్వ విద్యార్థులు స్పందించి సుమారు 67 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బుధవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయురాలకు అందించారు. ఎప్పుడో చదువు చెప్పిన విద్యార్థులు ఇప్పుడు వచ్చి ఆర్థిక సహాయం అందించినందుకు సదరు ఉపాధ్యాయురాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సింగోజి జనార్దన్, రంగదాంపల్లి శ్రీను, వంగ శ్రీనివాస్ రెడ్డి, రాధాకృష్ణ, కర్ణాకర్ రెడ్డి, రాము, లక్ష్మణ్, ఆనంద్, రోహిణి, పరమేశ్వరి, సంగీత, భాగ్యలక్ష్మి, దయనంద్, సోమేశ్వర్, సురభి ప్రవీణ్, నాయకం ప్రసాద్, విజయభాస్కర్, కోల రాజు పాల్గొన్నారు.

కుల సంఘం భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దుబ్బాక

అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చిన్ననిజాంపేట గ్రామంలో నిర్మించిన పలు కుల సంఘ భవనాలను సర్పంచ్ షేర్ల రచన కైలాష్,ఎంపిటిసి మంగళగిరి అంజమ్మ తో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. రూ.5 లక్షల వ్యయం (డిఎంఎఫ్ టి నిధులు)తో కురుమ సంఘం,అలాగే రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. బొప్పాపూర్ గ్రామంలో పంచాయతీరాజ్ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన గౌడ సంఘం భవనానికి సర్పంచ్ బండమీది బాలమణి మల్లయ్య, గౌడ సంఘం సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వెంట ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జెడ్పిటిసి కడ్తాల రవీందర్ రెడ్డి, ఏఎంసి చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించానన్నారు. అలాగే పిల్లల ఎదుగుదలకు తగిన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. రికార్డులను పరిశీలించి సమయానికి అనుగుణంగా కేంద్రానికి చేరుకోవాలని, తల్లిదండ్రులతో తత్సంబంధాలు మెరుగుపరుచుకోవాలన్నారు. అంగన్‌వాడీలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగా వచ్చేలా చూడాలని సర్పంచ్ ఓరుగంటి అశోక్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఆమె వెంట జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, ఎంపీడీవో మధుసూదన్, ఎంపీటీసీ సుతారి కళ్యాణి కనకరాజు, మండల వైద్యాధికారి నిమ్రాతరుణమ్, సీడీపీవో జయ, అంగన్వాడి సిబ్బంది నిర్మల, ఉమా, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-చేర్యాల

ఆల్విన్ కాలనిలో ప్రొఫెసర్ జయ శంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని మనుమ య(విశ్వబ్రాహ్మణ)సంఘం సిద్దిపేట జిల్లా యూత్ అధ్యక్షుడు తాటికొండ సదానం దం డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సదానందం మాటా_డుతూ పోలీసుల ముందే విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేసిన తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విశ్వబ్రా హ్మనులు రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జయశంకర్ తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు.

కోదండరాంను కలిసిన యువ నాయకులు



నవతెలంగాణ-వర్గల్

వేములవాడకు వెళ్తున్న కోదండరాంను మార్గం మధ్యలో వర్గల్ మండలంలోని గౌరారం వద్ద తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ నిరుడు స్వామి, కాంగ్రెస్ నాయకులు అనిల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కోదండరాంని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా కోదండరాంతో అల్పాహారం తీసుకొని ఉపాధి హామీలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలను గురించి వినతి చేశారు. వారికి రావాల్సిన జీతాలు సమయానికి రావడంలేదని టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలు వారికి తెలిపారు. వారివెంట ప్రవీణ్ కుమార్, తుమ్మ శ్రీనివాస్, పొన్నాల శ్యామ్, సాయికుమార్, చిగురుపల్లి స్వామి, నవీన్ తదితరులు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కృషి చేస్తా

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. అక్బర్ పేట భూంపల్లి మండలం మోతే గ్రామంలో నూతనంగా నిర్మించిన మూడు కమ్యూనిటీ భవనాలను స్థానిక సర్పంచు శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా కృషి చేయాలన్నారు. ఎన్నికల సమయంలోనే పార్టీల కోసం నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని ఎన్నికలు ముగిసాక గ్రామాల అభివృద్ధి కోసం ముందుకు సాగాలన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు నెలకొంటే తన దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, ఎంపీపీ సాయిలు, లక్ష్మీ లింగం, జడ్పిటిసి రవీందర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు బి ఆర్ ఎస్ నాయకులు నర్సింలు రాజేశ్వర్ బూపాల్ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

జ్యోతిబసు స్ఫూర్తితో ఉద్యమిస్తాం

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

అమరజీవి జ్యోతిబస్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఎం సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవికుమార్ అన్నారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జ్యోతి బస్ 14వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన జ్యోతిబస్ 1964లో సిపిఎం పార్టీ ఏర్పాటు చేయడంలో అగ్రస్థానంలో ఉన్నారన్నారు. సీపీఎం మొట్టమొదటి పొలిట్ బ్యూరోలో ఒకరుగా పశ్చిమ బెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా సేవలందించారని తెలిపారు. ఆయన తుది శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని పశ్చిమ బెంగాల్లో పార్టీ పెరుగుదలకు, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారన్నారు. దేశంలో ప్రధాన మంత్రిగా అవకాశం వచ్చిన పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉండి పార్టీలో తన స్థానం చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. అలాంటి మహనీయుని యొక్క ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళులని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు తేలు ఇస్తారి, జాలిగపు శిరీష, కొండం సంజీవ్ కుమార్, వంగ రవీందర్ రెడ్డి, తాడిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వాగుపై బ్రిడ్జి నిర్మించాలి



నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని వేచరేణి గ్రామానికి ఆనుకొని ఉన్న వాగుపై లో లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని బుధవారం గ్రామానికి చెందిన యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాదాసు బాలకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్తులు వాగులో టెంట్ వేసుకొని నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాదాసు బాలకృష్ణ మాట్లాడుతూ వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని గత రెండు సంవత్సరాలుగా అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ అప్పటి ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. వాగు అవతల ఉన్న తమ వ్యవసాయ బావుల వద్దకు కాని గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాల నిమిత్తం వైకుంఠధామానికి తీసుకెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామన్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో వాగు పొంగిపొర్లు తుండగా గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందితే శవాన్ని వాగులో నుంచి వైకుంఠధామానికి తీసుకెళ్లడా నికి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వర్షాకాలం రాకముందే వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్వాటకం మాధవ రెడ్డి, బూర్గు వెంకటేశం, తాళ్లపల్లి వెంకటేష్ గౌడ్,అజాం, కనకయ్య, సత్యనారా యణ, కనకయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.